క్లుప్తంగా

నాణ్యతతో రోడ్లు నిర్మించాలి



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఈ

కె.గంగవరం: సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయి నాణ్యతతో నిబంధనల ప్రకారం నిర్మించాలని పంచాయతీరాజ్ ఏఈ ఏసురత్నం అన్నారు. మండలంలోని అముజూరులో ఎంపీ బోస్ ఇచ్చిన సుమారు రూ.5 లక్షల గ్రాంట్‌తో నిర్మిస్తున్న సీసీ రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో ఎటువంటి దాపరికాలు లేకుండా నిర్మాణం జరగాలన్నారు. సీసీ రోడ్డు నిర్మించిన అనంతరం ప్రతి రోజు క్రమం తప్పకుండా నీటితో తడపాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత ఉంటేనే బిల్లు అందిస్తామని నాణ్యత లేకపోతే ఇబ్బందులు పడతారని ఆయన హెచ్చరించారు. సర్పంచ్ ఎన్.కళ్యాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సభలు, సమావేశాలు పెట్టవద్దు

మండపేట: అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించవద్దని టౌన్ సీఐ దారం సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్ల నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉందన్నారు. డీఎస్పీ రఘువీర్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 30 వరకూ ఈ సెక్షన్ అమలు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా టౌన్‌లో చట్టం అమలు పరిచినట్టు తెలిపారు. సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. రూరల్ పరిధిలోనూ ఇదే చట్టం అమలవుతుందని రూరల్ ఎస్ఐ పీ బుజ్జిబాబు తెలిపారు.

మద్యం షాపు తొలగింపునకు స్పష్టమైన హామీ

మండపేట: స్థానిక సత్యశ్రీ రోడ్డులో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు తొలగింపునకు సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్పష్టమైన హామీ ఇచ్చారని నిరసన కారులు తెలిపారు. ఇక్కడ వైన్ షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా గత 14 రోజులుగా 28, 29 వార్డుల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేగుళ్ల చొరవతో సబ్ కలెక్టర్ ఇచ్చిన హామీతో నిరసకారులు శాంతించారు. తొలుత మూడు వార్డుల ప్రజలు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. కేశవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి సబ్ కలెక్టర్ వస్తున్నారని, అక్కడ సబ్ కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం అని ఎమ్మెల్యే చెప్పారు. మహిళలు అంతా కేశవరం వెళ్లి సబ్ కలెక్టర్‌ను కలిసి 15 రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నిరసన కారులు తెలిపారు. కార్యక్రమంలో బండి గోవిందు, గుత్తుల సత్తిబాబు, షేక్ ఇబ్రహీం, గుత్తుల బాబి, మద్దూరి సిద్ధు, రెడ్డి రత్తయ్య, మద్దూరి దేవి, రావూరి దుర్గాదేవి, పిల్లి పద్మ, షేక్ మున్ని, ఈత మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సెల్ చైర్మన్‌గా కామన

మండపేట: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కిసాన్ సెల్ చైర్మన్‌గా ఏఐసీసీ సభ్యుడు, మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను కలసిన కామన ఆమె చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పర్యటించి రైతు సమస్యలపై పోరాటం చేయాలని షర్మిల సూచినట్టు కామన తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజనాల రామ్మోహనరావు, నరహరిశెట్టి నరసింహారావు, వడ్డి నాగేశ్వరరావు, మీసాల బాబి, గేదెల శ్రీనివాస్, పీ సత్యనారాయణ, వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలి

రాయవరం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేరిప్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వెదురుపాక ఇందిరమ్మ కాలనీలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంఈవో-2 యర్రమాటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎంవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేలాది రూపాయలు ఖర్చుచేసి చదివించే బదులు సర్కారు బడిలో చేర్పించడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న అనేక మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని అన్నారు. గ్రామంలో పర్యటించి ఐదుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

బాధితునికి వైద్య సహాయం

మలికిపురం: స్థానిక భూపతి వారి పేటకు చెందిన నవయువ నాగభూషణ నగర్ యూత్ ఆధ్వర్యంలో అనారోగ్యం కారణంగా గుర్రం చంద్రమోహన్‌కు వైద్యం నిమిత్తం యూత్ సేకరించిన రూ.70 వేలను శుక్రవారం అందించారు. మలికిపురం సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, తులసీభాస్కరరావు చేతుల మీదుగా అందించారు.

అపరాల సాగు.. ఆసక్తి కరవు

- మూడో పంటకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రైతులకు వ్యవసాధికారుల సూచన



కాజులూరులో యంత్రాలతో కోత కోయడంతో అపరాల సాగుకు పనికిరాకుండా పోయిన వరిపొలం



ఆర్యావటంలో గత ఏడాది రైతులు సాగుచేసిన పెసర పంట

కాజులూరు: డెల్టా కాలువ శివారు భూముల్లో మూడో పంటగా రైతులు పెసర, మినుము వంటి అపరాలను విధిగా పండించేవారు. కాలక్రమంలో సాగునీరు విడుదలలో చోటు చేసుకున్న మార్పులతో వరిపంట సాగులో ఆలస్యం, పంటకోతకు యంత్రాల వినియోగం, అపరాల పంటపై అంతుచిక్కని తెగుళ్ల తదితర కారణాలతో మూడో పంట ఏ ఏడాదికా ఏడాది తగ్గిపోతూ వస్తుంది. తూర్పు డెల్టాలో రైతులు దాళ్వా సాగు అనంతరం సుమారు 80 శాతం పొలాల్లో అపరాల సాగు చేపట్టేవారు. వరి పంట సాగులో నారు పోసిన నాటి నుంచి నాట్లు వేయటం, కాలిబాటలు తీయటం, కలుపుతీత, పురుగుమందులు, ఎరువులు చల్లిక వంటి అనేక ఖర్చులు అధికంగా ఉంటాయి. అపరాల సాగులో వరి పంటకు వచ్చిన ఆదాయం రాకపోయినప్పటికీ పొలంలో విత్తనాలు చల్లిన పిదప అవసరాన్ని బట్టి ఒకటి, రెండు సార్లు పురుగుమందులు చల్లడం మినహా మరే ఇతర ఖర్చులు ఉండవు. దీంతో గతంలో రైతులు అపరాల సాగుకు మొగ్గు చూపేవారు. అయితే మారుతున్న పరిస్థితుల కారణంగా డెల్టాలో ఇటీవల కేవలం 20 శాతం పొలాల్లో కూడా అపరాలు సాగు జరగడం లేదు. గతంలో మే చివరి వారం నాటికి కాలువ నీరు విడుదల చేసేవారు. దీంతో జూన్, జూలైలో తొలకరి సాగు, నవంబరు లేదా డిసెంబర్‌లో దాళ్వా సాగు ప్రారంభమయ్యేది. మార్చి నెలాఖరుకు రెండో పంట పూర్తి స్థాయిలో చేతికొచ్చేది. ఈ సమయంలోనే అపరాలకు అసలైన పదును కుదురుతుంది. ప్రస్తుతం నియోజకవర్గ గ్రామాల్లో వరి పంట అక్కడక్కడా చిరుపొట్ట దశలో ఉండగా అధిక శాతం పొలాల్లో ఈనిక దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉంది. ఈ ఏడాది మే మొదటి, లేదా రెండో వారాంతానికి కాని దాళ్వా మాసూళ్లు పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో అపరాలను సాగు చేసేందుకు వీలులేకుండా పోయింది.

యంత్రాల వినియోగం మరో కారణం

దాళ్వా మాసూళ్లు ఆలస్యమై అదును దాటిపోవటం అపరాల సాగు తగ్గిపోవటానికి ఒక కారణమైతే వరిపంట కోతకు యంత్రాల వినియోగం మరో కారణం. పొలంలో పెసర లేదా మినుము వంటి అపరాలు సాగు చేయాలంటే పొలంలోని మట్టిలో తేమ ఉండాలి. గతంలో పంట కోతకు రెండు, మూడు రోజులు ముందు నెల తడితడిగా ఉండగా రైతులు అపరాల విత్తనాలు చల్లి కూలీలతో కోత కోయించేవారు. ఆపై పొలంలో చల్లిన అపరాల విత్తనాలు మొలకలు వచ్చి పెరిగేవి. ప్రస్తుతం అధికశాతం రైతులు పంటకోతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాలు పొలంలో తిరగాలంటే నేల పూర్తిగా తడి ఆరిపోయి ఉండాలి. దీంతో పొలంలో రైతులకు అపరాల విత్తనాలు చల్లేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఈ పరిస్థితులను అధిగమించి కొందరు రైతులు ఆలస్యమైనా ఆశ చావక పెసరా లేదా మినుము సాగుచేయడానికి సిద్ధమౌతున్నప్పటికీ అదును దాటిన తర్వాత సాగు చేయటంతో సాగు చేసిన ప్రాంతమంతా పూత దశకు వచ్చేసరికి తెగులు సోకి ఎందుకు పనికి రాకుండా పోతుందని పలువురు రైతులు చెబుతున్నారు.

అపరాల సాగుతో అనేక ప్రయోజనాలు



అపరాల సాగు వలన భూమిలో నత్రజని పెరిగి భూసారం వృద్ధి చెందడంతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఏటా వరి సాగు ఆలస్యమౌతుండడంతో దాని ప్రభావం అపరాల సాగుపై పడుతుంది. ఎండల తీవ్రతకు తెగుళ్ల ఉధృతి ఎక్కువవుతుండటంతో అపరాలు సాగు చేసినా దిగుబడి లేక నిరుపయోగమౌతుంది.

– నురుకుర్తి శ్రీనివాసరావు, రైతు, టి.మామిడాడ

సకాలంలో పంటలు వేయాలి



ఖరీఫ్, రబీ సాగులు సకాలంలో పూర్తయ్యేలా చేసి మార్చి నెలాఖరు నాటికి దాళ్వా పంట పూర్తయితే అపరాల సాగుకు వాతావరణం అనుకూలిస్తుంది. వ్యవసాయాధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు సమష్టి కృషితో సాగునీటి విడుదలలో మార్పులు తీసుకురావాలి. మూడో పంటపై రైతులలో అవగాహన కల్పించాలి.

– కర్రి రామారెడ్డి, రైతు, గొల్లపాలెం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వరితో పాటు అదనపు ఆదాయాలను తెచ్చే అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జనుము, పిల్లిపెసర, పెసర, మినుము వంటి అపరాల విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తుంది. మినుము విత్తనాలు నాలుగు కేజీల మార్కెట్ ధర 560 ఉండగా సబ్సిడీపై 280కి, పెసర విత్తనాలు నాలుగు కేజీల మార్కెట్ ధర 520 ఉండగా సబ్సిడీపై 260కి గ్రామాలలోని రైతు సేవాకేంద్రాల వద్ద వీఏఏలు సరఫరా చేస్తున్నారు.

– వి.అశోక్, ఏవో, కాజులూరు

దరఖాస్తుదారులకు నేడు ఇంటర్వ్యూలు

మండపేట: వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు శుక్రవారం తెలిపారు. రుణాలకు దరఖాసు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. వివిధ బ్యాంకుల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఆధార్, బ్యాంకు పాస్ బుక్, పాన్‌కార్డు, రైస్‌కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

నరసాపురపుపేట హైస్కూల్‌కి రాష్ట్ర స్థాయి ర్యాంకులు



రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గోదావరి రామాయణం టాలెంట్ టెస్ట్‌లో మొదటి నాలుగు ర్యాంకులు కైవశం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి శుక్రవారం విలేకరులకు తెలిపారు. పదో తరగతి విద్యార్థిని ఐ.శ్యామలాదేవి రాష్ట్ర ఫస్ట్‌ర్యాంకు, ఆరో తరగతి విద్యార్థిని వి.ప్రణీత, 3 వ తరగతి విద్యార్థిని వీవీఎస్ శ్రీలక్ష్మి, ఐదో తరగతి విద్యార్థిని ఎ.వైష్ణవిలు సెకండ్ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరిని సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, ఎంఈఓలు వీరరాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పి.కృష్ణవేణి, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

వాడీవేడిగా సర్వ సభ్య సమావేశం

సమస్యలపై అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు



రోడ్ల పేరుతో నిధులు దోచుకున్నారని సమావేశంలో విమర్శిస్తున్న ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వైద్య. విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల వద్ద రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కోట సర్పంచ్ సునీత, యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు, కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రంగా కానరావడం లేదన్నారు. ప్రస్తుతం వేసవి కారణంగా తాగునీటి ఇబ్బంది చాలా తీవ్రంగా ఉందని అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరిచాలని కోరారు.

రోడ్ల పేరుతో నిధులు దోచుకున్నారు..

దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ తమ గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద గల జగనన్న లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 164 మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారన్నారు. కానీ ఈ కాలనీలకు కనీస మౌలిక సదుపాలు కూడా ఇప్పటి ప్రభుత్వం కల్పించలేదన్నారు. జగన్న కాలనీలో రోడ్ల పేరుతో సదరు కాంట్రాక్టర్ నిధులు దోచుకున్నారని కానీ రోడ్లు వేయలేదని విమర్శించారు. పై అధికారులు దీనిపై స్పందించి విచారణ జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేకపోతే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేసి ప్రజలకు న్యాయం చేస్తామని హెచ్చరించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో పనిచేయాలి..

మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం కావడం వల్ల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్ షెడ్లను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ



గొల్లపాలెం షాపులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు

కాజులూరు: గొల్లపాలెంలో దీర్ఘకాలికంగా నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్లను డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో 2009లో మార్కెట్ సెంటర్‌లోని పంచాయతీ స్థలంలో డీఆర్‌డీఏ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. నాటి నుంచి నేటి వరకూ షాపులు ప్రారంభోత్సవానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో గొల్లపాలెం తదితర ప్రాంతాల కలంకారీ వ్యాపారులు వస్త్ర వ్యాపారం చేసుకునేందుకు షాపులు తెరచి వేలం పాట నిర్వహించాలని డీఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై స్పందిస్తూ డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసులు షాపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో షాపులు ప్రారంభించి వేలం ద్వారా వ్యాపారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, కడలి రాంపండు, కొల్లు హనుమంతరావు, పలువురు కలంకారి వ్యాపారులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్ల అప్పగింత



లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

మండపేట: పట్టణంలోని ఫేజ్ 1లో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించినప్పటికీ సరిగా వసతులు కల్పించలేదనే సాకుతో గృహ ప్రవేశాలు చేయకుండా కాలయాపన చేస్తున్న తరుణంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు స్పందించారు. గొల్లపుంత రోడ్డులోని టిడ్కో సముదాయాల వద్దే శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. ముఖ్యంగా ఇళ్ల అప్పగింతపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శిబిరాల వద్ద లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో అక్కడకు వచ్చిన లబ్ధిదారుల వివరాలు పరిశీలించి తాళాలు చేతికి ఇస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాళాలు అందుకున్న వారంతా వెంటనే శుభ్రం చేసుకుని గృహ ప్రవేశాలు చేయాలని ఆదేశించారు. తాళాలు పుచ్చుకుని కాలం వెళ్లదీయాలని చూస్తే మాత్రం నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇచ్చిన తాళం తిరిగి తీసుకుని అర్హులైన కొత్త వారికి అప్పగిస్తామనారు. లబ్ధిదారులందరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని గృహ ప్రవేశాలు చేసి కాలనీలోకి కాపురాలకు రావడం మంచిదని హితవు పలికారు. ఈ అవకాశం ఈ నెల 7 వరకే ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీహరి మోహన్, డీఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బి. ఆంజనేయులు, టిడ్కో ఏఈ వివేక్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, వార్డు ప్లానింగ్, వార్డు వెల్ఫేర్, వార్డు ఎనిమిటీ కార్యదర్శులు, డ్వాక్రా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను తగ్గించి చూపిస్తున్నారు

మండల సర్వ సభ్య సమావేశంలో సర్పంచ్ తుకారం



రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన రీసర్వే గ్రామ సభల్లో ప్రజలు తమ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను రెవెన్యూ శాఖ తగ్గించి చూపిస్తుందని వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం రెవెన్యూ శాఖపై మండిపడ్డారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ వాసంశెట్టి సత్యప్రసాద్ తమ శాఖ వివరాలను వెల్లడించగా వేగాయమ్మపేట సర్పంచ్ తుకారం మాట్లాడుతూ రీసర్వే గ్రామ సభల్లో తమ గ్రామంలోనే సుమారు 140 మందికి పైగా తమ సమస్యలపై దరఖాస్తులను సమర్పించారని కానీ కేవలం 19 మాత్రమే ఆన్‌లైన్ చేశారంటే రెవెన్యూ శాఖ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. ఆర్ఐ సత్యప్రసాద్ మాట్లాడుతూ సర్పంచ్ ఆరోపణల్లో వాస్తవం ఉందన్నారు. ఆయా గ్రామాల్లో సర్వేయర్లు, వీఆర్‌ఓల అలసత్వం వల్ల వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయలేదని అంగీకరించారు. ఏదైనా సమస్యలు ఉంటే ఆఫీసుకు వచ్చి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆర్ఐ సూచించారు. సర్పంచ్ తుకారం, కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్‌లు మాట్లాడుతూ పొరపాటున దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లిన రైతుల భూముల సమస్యను రెవెన్యూ శాఖకు ఎన్ని సార్లు అర్జీలు పెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని దుయ్యబట్టారు. 22ఏ సమస్యలను పరిష్కరించమని అర్జీలు పెట్టుకుంటే మీ సమస్య పరిష్కరించబడింది అంటూ ప్రభుత్వం నుంచి తమ అర్జీలకు సమాధానం వస్తుందని కానీ సమస్య ఎక్కడిది అక్కడే ఉందని మండిపడ్డారు. ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లు డ్వాక్రా సభ్యులకు మంజూరు చేస్తున్న రుణాల్లో ఒక్కొక్కరి నుంచి రూ.300 వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అయితే వెలుగు శాఖ నుంచి అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు కొందరిని సస్పెండ్ చేయడంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏపీఓ మోర్త ఈశ్వరరావును ప్రశ్నించారు. గత నెల 28న రామచంద్రపరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఫైనల్ పబ్లిక్ హియరింగ్ సభలో ఎటువంటి ప్రస్తావన లేకపోయినా ఎక్కువ రికవరీలు ఉన్న వారిని విడిచిపెట్టి తక్కువ రికవరీలు ఉన్న వారికి సస్పెండ్ చేయడం పట్ల మండిపడ్డారు. హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో వసతులు సక్రమంగా లేవని విద్యార్థులు అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుని చక్కదిద్దాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల సమస్యలు ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కరించాలి..

రెవెన్యూ రికార్డుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాల్సి వస్తే జేసీ వరకు వెళ్లేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 22 ఏలో తప్పుగా పడిన రికార్డులైతే దేవదాయ శాఖ కమిషనర్ నుంచి పరిష్కరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్డీఓ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి.

ఆలయానికి ఉత్సవమూర్తుల సమర్పణ



వానపల్లిలో ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణ చేస్తున్న దృశ్యం

కొత్తపేట: మండలంలోని వానపల్లిలో వేంచేసిన ఉమా బాలాత్రిపురసుందరీ సమేత వైద్యనాధీశ్వర స్వామి ఆలయంలో నూతన ఉత్సవ మూర్తులకు శుక్రవారం సంప్రోక్షణ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన కర్రి శివ ప్రదీప్‌రెడ్డి దంపతులు వైద్యనాధీశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలను సమర్పించారు. ఆ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేదపండితులు వెలవలపల్లి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, విలపర్తి సూర్యనారాయణ శర్మ శిష్యబృందం వాస్తుపూజ, శాంతిహోమం, పుణ్యాహవాచనం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

7న జాతీయస్థాయి వెబినార్



వెబినార్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రావులపాలెం: స్థానిక డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఇంటర్నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 7న జాతీయస్థాయి వెబినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రత్యేక స్పీకర్‌గా అసిస్టెంట్ కంట్రోలర్ పేరెంట్స్ అండ్ డిజైన్ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ నాగపూర్‌కు చెందిన కుమార్‌రాజు వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఈ వెబినార్ వినియోగించుకోవాలన్నారు.

అలమూరు ఏఎంసీ చైర్మన్‌గా వెంకటలక్ష్మి

అలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతలో ఆమె ఆలమూరుల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా 2015–18 మధ్య కాలంలో సుమారు మూడేళ్ల పాటు పనిచేశారు. ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన వెంకటలక్ష్మికి పలువురు కూటమి నేతలు అభినందనలు తెలియజేశారు.

జాబ్ మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2025–2026 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ మే జూన్ మాసాలకు సంబంధించి మొదటి త్రైమాసికానికి ఏడు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న జాబ్ మేళాల క్యాలెండర్ గోడ పత్రికను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు మాట్లాడుతూ శుక్రవారం అమలాపురంలో నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఏప్రిల్ 17న పి.గన్నవరం నియోజక వర్గంలో, మే 2న మండపేట నియోజకవర్గంలో మే 16న కొత్తపేట నియోజకవర్గంలో, మే 23న ముమ్మిడివరం నియోజకవర్గంలో, జూన్ 6న రాజోలు నియోజకవర్గంలో, జూన్ 13న రామచంద్రపురం నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు.

తీరప్రాంత రక్షణ కవచం మడ అడవులు

యానాం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కవచంలా మడ అడవులు ఎంతగానో ఉపకరిస్తున్నాయని స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగ అధ్యాపకుడు జేవీ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో బోటనీ విభాగ విద్యార్థులతో అంతర్వేది సాగర సంగమం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్వేది వద్ద మాంగ్రూవ్ ఫారెస్ట్ ప్రాంతాలను వారు పరిశీలించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.